


# కాలమ్ దాటని కబుర్లు

## బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### తంతి తపాలా

***ఓ ఎడ్రెస్ అడగడానికి*** రోడ్డు మీద ఖాళీగా ఎవరైనా కనిపిస్తే బావుండ్ను అని ఓ యాభై మందిదాకా చూసాను... ఒక్కళ్ళంటే ఒక్కళ్ళు ఖాళీగా లేరు. చెవి దగ్గర కర్ణుడి కవచకుండలాల్లా సెల్‌ఫోన్ పట్టుకోకుండా. ముసలాళ్ళు, కుర్రాళ్ళు, చిన్నపిల్లలు. బజ్జీలేసే ఆడమనిషి, ఆటో నడిపే అతను, బస్‌స్టాండ్‌లో నిలబడ్డ నడివయసావిడ, కాలేజీ గర్ల్స్, ఎవరూ లేరంటే నమ్మండి.

అసలు సెల్‌ఫోన్లు ఓ వారం రోజుల పాటు పని చెయ్యకుండా చేస్తే ఏమౌతుందో చూడాలని ఉంది.

అరె.. సెల్‌ఫోన్లేకాదు, కనీసం టెలీఫోను కళ్ళతో చూడకుండా మా తరం వాళ్ళం పెరిగి పెద్దవలేదండీ?

మా అమ్మతో ఆఫీసుకి వెళ్తే నల్లని ఆ ఫోన్ 'ట్రింగ్..ట్రింగ్'మని మోగగానే ఎంత భయం వేసేదో?

నేను ఇంటర్‌మీడియెట్‌లో ఉండగా సంగీత అనే క్లాస్‌మేట్ ఇంటికి వెళ్తే వాళ్ళ ఇంట్లో ఫోన్ ఉంది. అమ్మో సంగీతా వాళ్ళు ఇంత గొప్పవాళ్ళా? అనుకున్నాం. అందులో నెంబర్ తిప్పి మొత్తం మా ఐదుగురు ఫ్రెండ్సూ, మాతో మాటలు లేని రజని అనేవాళ్ళ ఇంటికి ఫోన్ చేసి, దాన్ని ఒకళ్ళ తర్వాత ఒకళ్ళం పేర్లు చెప్పకుండా మారుగొంతులతో మాట్లాడి గంట ఏడిపించాం. మొదట్లో ఫోన్ కాల్ చేసి ఎంత మాట్లాడినా ఒక కాల్ ఖరీదే అయ్యేది.

అసలు చిన్నతనాల్లో బంధువులతో కమ్యూనికేషను కానీ, ఒకళ్ళ గురించి ఒకరికి తెలియడానికి కానీ, అన్ని పనులూ సజావుగా జరగడానికి కానీ ఫోన్లు అవసరమే వుండేవి కావు.

బంధువులు ఎవరోస్తున్నారన్నా ఉత్తరం వచ్చేది. 'ఫలానా తారీఖున వస్తున్నాం'దక్షిణ్'కి స్టేషన్‌కి రండి'' అని. లేదా.. ఎవరైనా పోతే అర్ధరాత్రుళ్ళు టెలిగ్రామ్‌లొచ్చేవి. అదీకాదంటే, ఊళ్ళో వెళ్ళి చెప్పొచ్చేవాళ్ళం.

''అనసూయా వాళ్ళింటికెళ్ళి అత్తయ్యగారిని తయ్యారుగా ఉండమను. బజారుకెళ్ళాలీ'' అని అమ్మ చెపితే తూనీగల్లా వార్త అందించడానికి పరిగెత్తేవాళ్ళం.

''ఏడుకొండలు సార్‌కి లెటర్ ఇయ్యి'' అని రాణీ టీచర్ మెలికలు తిరుగుతూ ఉత్తరం ఇస్తే సందానీగాడు రయ్యిన వెళ్ళి ''సా...సా...రాణీ టీచర్ లెటర్ ఇచ్చినయ్'' అని గట్టిగా స్టాఫ్‌రూంలో అరిచి ఉత్తరం ఇస్తే, మర్నాడు అంతా వాడిని ఏడుకొండలు సార్ గోడ కుర్చీ వేయించడం నాకు గుర్తే.

సందానికి మాత్రం తను చేసిన సాయానికి ఏ మరమరాలుండలో కొనిపెట్టడానికి బదులు ఈ గోడ కుర్చీ ఏవిటో అర్థం అయ్యేది కాదు.

క్లాసుకి పాపమ్మ అనే అటెండర్ కాయితం తీసుకొస్తే 'నోటీస్... నోటీస్.. రేపు శలవ" అని మేము ఎగిరి గెంతులేసేవాళ్ళం.

ఒక్కోసారి ఆదివారం ప్రొద్దుటే తలంటుపోసుకుని, పెరట్లో పూసిన గొబ్బిపూల దండలు పెట్టుకుని అమ్మతో పెద్దమ్మా వాళ్ళింటికి 'వన్ నెంబర్' బస్సెక్కి సికింద్రాబాద్ వెళ్ళేవాళ్ళం. వాళ్ళూ ఆదివారం అని ఎక్కడికైనా వెళ్ళిపోతారేమోనని ప్రొద్దుట వాళ్ళు కాఫీలు తాగే టైంకల్లా వెళ్ళి వాలే వాళ్ళం.

"ష్.ష్. కాకి పొద్దుటనుండి అరుస్తూనే ఉంది. అనుకున్నాను ఎవరో వస్తారని" అనేది పెద్దమ్మ.

అసలు పెద్దమ్మ ఎప్పుడూ గంగాళాలతో కాఫీ డికాషన్లు తీసేదా అనిపించేది. ఎందుకంటే, సికింద్రాబాద్ స్టేషన్ నుండి వాళ్ళిల్లు పది నిమిషాలు నడక. అందుకే ఏ బంధువులైనా మొదట వాళ్ళింటికే వెళ్ళేవాళ్ళు. మా అక్కలు కాఫీలు అందిస్తూనే ఉండేవాళ్ళు.

మోండా మార్కెట్‌కి ఇరవై నిమిషాల నడక. పెద్ద గోనె సంచి తీసుకుని పెద్దనాన్న కూరలకి వెళ్తుంటే మేమూ సరదాగా వెళ్ళేవాళ్ళం. అరటిదూట, పనసకాయ, దబ్బకాయలు, పెండలం దుంప, నూల్‌కోల్, చామకూర, వాక్కాయలు, చింతచిగురు, ఆకాకరకాయలు చెమ్మకాయలు.. ఇలా మామూలు దుకాణాలలో పెట్టని కూరలన్నీ కొనేవారు పెద్దనాన్న.

చామ ఆకులు వంటింట్లో పరిచి, వాటికి సెనగపిండీ, ఉప్పూ, కారం రాసి, గుండ్రంగా చుట్టి అప్పుడు చాకుతో ముక్కలుగా కోసి, వేయిస్తే, టై బిస్కెట్లలా కరకరలాడుతూ బజ్జీలు ఎంత బావుండేవో.

పెద్దమ్మ ఎవరో ఒకరు వస్తూనే ఉంటారు అని ఆదివారంనాడు పెద్ద ఇత్తడి కళాయి పెట్టి, మైసూర్ పాకం ముక్కలూ, ఓ పక్క ఇంత పులిహోరా చేసి పెట్టేది. పి.లీల లాంటి చక్కని గొంతుతో 'దినదినము పాపడ్ని దీవించి పోరండి.. దేవలోకములోని దేవతల్లారా.. దేవతల్లారా...' అని పాడేది. పొడవాటి సవరం పెట్టి జడేసుకుని చామంతులు పెట్టుకునేది.

వంకాయలూ, దోసకాయలూ, దొండకాయలు అన్నీ ఐదుకిలోలూ, ఆరుకిలోలు కొనేవారు. గమ్మున చుట్టాలొస్తేనో? భోజనాలయి పడుకున్నాక కూడా, బండి ఆలశ్యంగా వచ్చిందని వచ్చి తలుపులు కొట్టేవారు కొందరు. పెద్దమ్మా చాలా రోజులు కట్టెల పొయ్యీ, కిరోసిన్ స్టౌవ్ మీదే ఇంతలేసి వంటలు చేసేది పాపం.

కందిపొడీ, ఆవకాయా, కాల్చిన అప్పడం, గడ్డపెరుగుతోబాటు ఒక వేపుడు కూరా, చారుతో అర్థరాత్రి అయినా భోజనం తయ్యారు. అందరూ క్రింద కూర్చుని పొడవాటి వంటింటి ముందు వసారాలో భోజనాలు చేసేవాళ్ళు

ఇంక చెప్పివచ్చే అతిథులకి నవకాయ పిండివంటలే సుమా అండీ.

ఇదంతా ఎందుకు చెప్తున్నానంటే ఫోన్‌లు లేకపోయినా ఏవీ ఇబ్బంది అయ్యేదికాదు. అమ్మ చాలా దూరాలు గడ్డిఅన్నారం, రామచంద్రపురం కూడా వాళ్ళకి ముందుగా చెప్పకుండానే తీసుకెళ్ళేది. ఓసారి మా అత్తయ్యా వాళ్ళింటికి వెళ్ళాం. వాళ్ళు బి.హెచ్.ఇ.ఎల్‌లో ఉండేవాళ్ళు. మేము చిక్కడిపల్లి నుండి రెండు బస్సులు మారి వాళ్ళింటికి వెళ్తే వాళ్ళ ఇంటికి తాళం.

అలాంటప్పుడు అమ్మ "అయ్యో ఆకలేస్తోందా?" అని హోటల్‌కి తీసుకెళ్ళి మసాలాదోశ, ఇడ్లీ పెట్టించి కాఫీ తాగించేది. ఒక్కోసారి దగ్గర్లో ఉన్న థియేటర్లో 'కీలుగుర్రమో', 'గులేబకావళీ కథో'లాంటి మంచి సినిమా కూడా చూపించేది. అందుకని చుట్టాలు లేకపోతే బావుండ్ను అని కూడా మనసులో అనుకునేవాళ్ళం. ఇవన్నీ చేస్తే ఏ పద్దెనిమిది రూపాయలలో ఖర్చు అయ్యేవి అంతే.

అమ్మ ఫ్రెండ్స్ రాజమణీ, తంగమణీ, సరోజినీ అనేవాళ్ళు అప్పట్లో ముప్పైరూపాయలు పెట్టి ప్రతినెలా గ్రాము బంగారం కొంటారని ఆశ్చర్యంగా చెప్పేది. అమ్మ నాకు ఇరవైరెండు రూపాయలకి కొన్న కుచ్చుల గౌను ఆరెంజ్ కలర్‌ది నాకింకా గుర్తుంది.

సందానీగాడికి వాళ్ళమ్మ వాళ్ళ నాన్న చొక్కాలు మడిచి కుట్టివేసేది. వాడు అచ్చు దిష్టిబొమ్మలా ఉండేవాడు. ఒక్కోసారి ఆరురూపాయల మీటర్ తాను కొని, చీటీ బట్ట అనేవారు, పెద్ద పెద్ద పూలున్న పసుపు పచ్చ చొక్కా వీడికీ, గౌను వాడి చెల్లికీ కుట్టేది. ఇంకా బట్ట మిగిలితే వాకిటికి పరదా వేసేది. వాడు అందులో కలిసిపోయి నిలబడేవాడు వాకిట్లో.

ఇంట్లో అక్కలకి పెళ్ళిచూపులు అవీ అయితే వాళ్ళు వెళ్ళి ఉత్తరం రాస్తాం అనేవారు. అయినా ఊళ్ళో అయితే మా అమ్మమ్మ మనిషిని పంపేది. మా బంగారపు పన్ను కృష్ణమూర్తి వంటతోబాటు పెళ్ళి సంబంధాలూ చూసేవాడు మరి.

నిత్యజీవితంలో పోస్ట్‌మేన్ భాగంగా ఉండేవాడు. రోజూ మూడుగంటలకి సైకిల్ బెల్లు గణగణా మోగేది. మా గౌసు వచ్చేవాడు. ఉత్తరాలతోబాటు మాకు ఎవరో వదిలేసిన రీడర్స్ డైజెస్టూ, సోవియట్ భూమి ఇచ్చేవాడు. అమ్మమ్మ ఇచ్చిన కాఫీ తాగి, "పెద్దమ్మాయిగారి దగ్గరనుండా ఉత్తరం?" అని అమ్మమ్మని వివరాలు కనుక్కునేవాడు.

నెలకి రెండుసార్లు, రిక్షావాడిని తిడుతూ, గుండెలు చేత్తో పట్టుకుని చిన్నమ్మమ్మ చిక్కడపల్లి నుండి ఆర్.టీ.సీ క్వార్టర్స్‌లో ఉన్న మా ఇంటికొచ్చేది. వాడికి రూపాయి పావలా బాడుగ.

"అక్కడినుండి ఇక్కడిదాకా తిట్టారమ్మా ఇంకో పావలా ఇప్పించండి" అనేవాడు.

"అంతవేగంగా తొక్కొద్దు.. గుండె దడ అంటే విన్నావా?" అనేది.

"ఊర్కోండీ.. నడిచి లాక్కొస్తే, వేగం అంటారూ!" అనేవాడు.

అమ్మమ్మ మధ్యాహ్నాలు ఏ రేషన్ షాపుకో, బొగ్గులకో వెళ్తే చిన్నమ్మమ్మకి కోపం వచ్చేది. "మనవలు ఇంతమంది ఉన్నారు. మా అక్కే వెళ్ళాలా చిన్నపిల్లలా?" అనేది.

అక్కా చెల్లెళ్ళు చిన్న కుక్కినవారు మంచం మీద కూర్చుని చిన్నపటి కబుర్లు చెప్పుకుని ఉప్పుపిండి తిని, కాఫీలు తాగేవారు. ఎంత స్నేహంగా ఉండేవారో అరవై, డెబ్బై ఏళ్ళు వచ్చేదాకానూ.

ఆ చిన్న మంచం ఒకప్పుడు పొడవాటి మంచమేనట. వాళ్ళ బామ్మ "ఒరే రావుడూ నేను చిన్నాడి దగ్గరకెళ్ళి నాలుగురోజులుండి వస్తానురా" అనగానే మా ముత్తాతగారు, దాని కుసులూడదీసి, నవారు చుట్టచుట్టి, ఆవిడ్నీ పెట్టెనీ బండిలో పెట్టి తమ్ముడింటికి పంపేవారుట. "అలాగే మళ్ళీ పెద్దాడిని చూడాలిరా.." అంటే ఆయన మంచం ఊడదీసి, నవారు చుట్టి చుట్టి ఈయన దగ్గరకి, పంపేవారుట. అలా రానాను ఆ మంచం పొట్టిదై పోయిందట. మరీ చిన్న పిల్లల మంచంలా ఉండేది అది.

ఫోన్లు లేకపోయినా, నేనూ సందానీ అగ్గిపెట్టె ఫోన్లు చేసుకుని అందులో మాట్లాడుకునేవాళ్ళం. అసలు క్లాసురూములో వాడిని ఓ మూల ఎప్పుడూ నీల్‌డౌన్ చేయించేవారు ఏ క్లాస్ అయినా. అప్పుడూ టైం వేస్ట్ చెయ్యక మా వైపు వాడు కాయితాలు ఉండగా వేస్తే మేం అందులో చుక్కలు కలిపే ఆట ఆడ్తుండే వాళ్ళం వాడితో. తలనిండా నూనె రాసుకునేవాడు, దానిమీద రబ్బర్ అద్ది.. ఆ రబ్బర్ నా సోషల్ టెక్స్‌బుక్‌లో గాంధీ, సుభాష్ చంద్రబోస్ ఫొటోల మీద అద్దితే, రబ్బర్ మీద బొమ్మ పడేది. అలాగే కాయితం కింద పదిపైసల బిళ్ళ పెట్టి రుద్దితే అచ్చు పడేది. ఇలా ఆటకి అంతరాయం రానిచ్చేవాడుకాడు.

ఓసారి రాణీ టీచర్‌కి ఇయ్యమని ఏడుకొండలు సార్ ఉత్తరం ఇస్తే మొదట తీసుకుని రయ్యిన వెళ్ళి, గతంలో సార్ ఇచ్చిన పనిష్మెంట్ గుర్తుచేసుకుని మళ్ళీ వెనక్కొచ్చి, ఆయన హెడ్ మాస్టర్‌తో మాట్లాడ్తుంటే మీటింగ్‌లో, రాణీ టీచర్‌కి ఉత్తరం మీరిచ్చింది అని చెప్పాలా... తాబేలు కమలా టీచర్ ఇచ్చింది అని చెప్పాలా? అన్నాడు. కమలా టీచర్ నోరు తెరిచి, గుడ్లు పెద్దవి చేసింది. ఆవిడ నెమ్మదిగా నడుస్తుందని ఆవిడ వెనకాల తాబేలు టీచర్ అంటారు అందరూనూ.

ఆ సాయంత్రం వాడిని ఏడుకొండలు సార్ గ్రౌండ్‌లో వంద రౌండ్లు పరిగెత్తించాడు పాపం.

నేను ఇంటర్మీడియెట్‌కి వచ్చాక, రహస్యంగా మా ఇంటికి రెండు కిలోమీటర్ల దూరాన ఉన్న టెలిగ్రాఫ్ ఆఫీస్‌కి వెళ్ళి మా కాబోయే శ్రీవారికి ఫోను చేసేదాన్ని, ఆయన ఆఫీసులో ఉండగా. మా ఆఖరి బాబాయి అక్కడ పనిచేసేవాడు. నాతో చాలా ఫ్రెండ్లీగా ఉండేవాడు "ప్రభాకర్‌కేనా? ఇంట్లో చెప్పనులే" అనేవాడు.

నేను ఉత్తరాలు రాస్తే చాలా బావుంటుందనీ, వీధిలో వాళ్ళ విశేషాలూ, మొత్తం చుట్టాల విశేషాలూ అన్నీ వివరంగా తెలుస్తాయి అని అమ్మమ్మ నాగ్‌పూర్ వెళ్ళినప్పుడు సంతోషపడేది. నాకూ పెద్ద పెద్ద ఉత్తరాలు అంటే చాలా ఇష్టం.

"అమ్మకి ఒంట్లో బాలేదు" అన్న సీరియస్ విషయం రాసి, కింద స్థలం మిగిలిందని అన్నయ్య ఓసారి రెండు ఆకులూ, ఓ తామరపువ్వూ వేస్తే నాన్నగారు దాన్ని సీరియస్‌గా తీసుకోలేదు. కొంపలు మునిగాయి. అందుకే ఉత్తరం రాసేటప్పుడు ‘ఆ టోన్ ఆఫ్ ది లెటర్‘ ఏవిటో తెలుసుకోవాలి.

నేను సందానీ నాన్న గురించి రాస్తే ఫకీరమ్మని పెరుమాళ్ళు తాగొచ్చి నెత్తి బద్దలు కొట్టాడని అందులో రాసేదాన్నికాదు. ఒకటి కామెడీ... ఒకటి సీరియస్సూనూ.

"లక్ష్మణరావుకి రాజమండ్రి ట్రాన్స్‌ఫర్ అయింది. లక్ష్మణరావు భార్యకి మళ్ళీ నెల తప్పింది" అని రాస్తే ఆ ఆర్డర్‌లో రాయకూడదని మా అమ్మ క్లాసు తీసుకుంది.

‘ఒక్కోసారి సన్యాసిరావు పెళ్ళాంకి లాటరీలో ఐదు తులాల బంగారు చైన్ వచ్చింది‘ అని రాస్తే అమ్మమ్మ ‘సన్యాసిరావు ఎవరు?‘ అని అడగడానికి నాగ్‌పూర్ నుండి టికెట్ కొనుక్కుని రావలసి వచ్చింది. అలా అప్పట్లోనే నాలో రచయిత్రితనం చివురులువేసి లతగా ఎదిగింది.

ఇంతకీ సన్యాసిరావు మా అమ్మ ఆఫీసులో పని చేసే వసుమకుమారి, ఇంటి పక్కన ఉండే మాధవీ వాళ్ళ బామ్మగారి కోడలు తమ్ముడు. నా కమ్యూనికేషన్ స్కిల్స్ అంత ఫాస్టుగా, లాంగ్ డిస్టెన్స్‌లు కూడా కవర్ చేసేవి మరి. ఇంక సెల్‌ఫోన్స్ ఎందుకు చెప్పండీ?




Post your comments

